క్లుప్తంగా

కట్ట మైసమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం



మరికల్: పట్టణంలోని మినీ ట్యాంకుబండ్‌పై నిర్మిస్తున్న కట్ట మైసమ్మ ఆలయ పునఃనిర్మాణానికి మంగళవారం దాత రవి కుమార్ రూ.11 వేలు విరాళంగా అందజేశారు. మంగళవారం ఆలయ కమిటీ సభ్యులను కలిసి నగదు అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు జోగు మల్లయ్య దాతను అభినందించారు. ఆలయ పనులు తర్వగా పూర్తి చేసి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తామన్నారు.

ఊట్కూరు ఎంఈఓగా మాధవి



ఊట్కూరు: ఊట్కూరు మండల విద్యాధికారిగా మాధవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో ఆమెను తాపస్ ఉపాధ్యాయ సంఘం, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం కుసుమ, ఉపాధ్యాయులు గోపాల్, మురళీధర్, రాములు, వెంకటేష్, పజల్, పారిజాత, ప్రేమకుమారి సన్మానించారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

ఊట్కూరు: విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించాలని డాక్టర్ సంతోషి అన్నారు. మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలకలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సౌచాలయానికి వెళ్లొచ్చినప్పుడు చేతులను సబ్బుతో కడుక్కోవాలన్నారు. అలాగే గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రక్తహీనత ఉన్న బాలికలు వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం గోవిందరమ్మ, కవిత, ప్రధానోపాధ్యాయురాలు మాధవి, పారిజాత, హేమకుమారిపాల్గొన్నారు.

నేడు బీజేపీ మండల కార్యవర్గం ఎన్నిక

నర్వ: మండల కేంద్రంలోని బీజేపీ రాష్ట్ర నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి ఫాంహౌస్‌లో బుధవారం బీజేపీ మండల కార్యవర్గ ఎన్నిక నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు అజిత్‌సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నిక నిర్వహించేందుకు ప్రభరీలు, రాష్ట్ర నాయకులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల బూత్ అధ్యక్షుడు, మండల సీనియర్ నాయకులు, గ్రామ అధ్యక్షుడు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్ సాధ్యం

నర్వ: చదువుతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమని పాతర్చేడ్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కృష్ణ అన్నారు. మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా బాలికా విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాలికలు చదువుకునేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. అన్ని రంగాల్లో స్త్రీలు రాణించేందుకు విద్య ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సదన్‌రావు, గోవిందు, పీఈటీ విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో పోలీసుల తనిఖీలు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో దొంగతనాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు కానిస్టేబుళ్లు గోపాల్, సంతోష్ తెలిపారు. మంగళవారం కొత్త బస్టాండ్‌తో పాటు ప్రధాన చౌరస్తాలో ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో అనుమానితుల వేలిముద్రలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బస్టాండ్ లో ప్రయాణికుల రూపంలో కొంతమంది వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిని కట్టడి చేయడానికి తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ప్రయాణికులు బస్సు ఎక్కె, దిగే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

దోమల నివారణలో భాగస్వాములవుదాం

అమరచింత: దోమల నివారణకు ప్రజలు మున్సిపాలిటీ సిబ్బందికి సహకరించాలని, పరిసరాల శుభ్రతలో ముందుండాలని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ శశిధర్ కోరారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 3వ వార్డులో శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలు కుడితే విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, తప్పకుండా దోమతెరలు వాడాలన్నారు.

దరఖాస్తుకు రెండు రోజులే గడువు..!

- జూన్ 5 వరకు పట్టా పొందిన వారు రైతు బంధుకు అర్హులు
- 20 వరకు దరఖాస్తుకు అవకాశం
- 8 క్లస్టర్ల పరిధిలో దరఖాస్తుల స్వీకరణ



దామరగిద్ద క్లస్టర్‌లో రైతు బంధుకు దరఖాస్తు చేసుకుంటున్న రైతులు (ఫైల్)

దామరగిద్ద: ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతుబంధు పథకంలో లబ్ధి పొందేందుకు అర్హులైన కొత్త రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుంది. కొత్తగా భూములు కొనుగోలు చేసి పట్టా అందుకున్న అన్నదాతలు అలాగే జూన్ 5 వరకు పట్టాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అర్హులైన రైతులు ఈ నెల 20వ తేదీ లోపు సంబంధిత ఏఈఓలను సంప్రదించి పథకానికి అవసరమైన ధృవపత్రాలను అందజేసి దరఖాస్తులు సమర్పించాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు. జూన్ 5 వరకు రిజిస్ట్రేషన్ అయి ఉండి పట్టాదారు పాసు పుస్తకం రాకపోయిన రిజిస్ట్రేషన్ చేయబడి భూ పరిపాలన ప్రధాన కమిషన్‌తో (సీసీఎల్‌ఏ) డిజిటల్ సంతకం పొందిన రైతులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. కాగా గతంలో రైతు బంధు పొందుతూ కొత్తగా భూములు కొనుగోలు చేసిన వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. కేవలం గతంలో రైతుబంధు పొందని రైతులు మాత్రమే కొత్తగా భూమిని కల్గి ఉన్న రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఈనెల 20 వరకే గడువు

2025 జూన్ 5 వరకు కొనుగోలు లేదా విరాసత్ తదితర పద్ధతుల్లో కొత్తగా పట్టా పొందిన రైతులు జూన్ 20వ తేదీ వరకు విధించిన గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలి. మండలంలోని దామరగిద్ద క్లస్టర్‌లో 57 మంది, కాన్‌కుర్తి–71 మంది, లోకూర్తి–39 మంది రైతులు, విఠలపూర్ క్లస్టర్‌లో–70 మంది, గడిమున్కన్‌పల్లిలో 83 మంది అన్నాసాగర్‌లో 69 మంది, బాపన్‌పల్లిలో 45 మంది, కంసాన్‌పల్లిలో 36 మంది మొత్తం ఎనిమిది క్లస్టర్‌ల పరిధిలో 470 మంది రైతులు పట్టాదారు పాసు పుస్తకాలు పొంది రైతు బంధు దరఖాస్తుకు అర్హత కలిగి ఉన్నారు. ఆయా క్లస్టర్ల పరిధిలో ఇప్పటికే కొంతమంది దరఖాస్తు చేసుకోగా మిగిలిన రైతులు దరఖాస్తు చేసుకుంటున్నారు. పట్టాదారు పాసుపుస్తకం లేదా డిజిటల్ సంతకం అయిన జిరాక్స్ కాపీ, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ సేవింగ్ ఖాతా జిరాక్స్, పూర్తి వివరాలతో నింపిన దరఖాస్తు ఫారంతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. దరఖాస్తు చేసుకోవడానికి రెండు రోజులే గడువు ఉండడంతో సకాలంలో దరఖాస్తు చేసుకుంటే రైతుబంధు పథకం ప్రయోజనాలను పొందే అవకాశం ఉంటుంది.

అర్హత కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలి



మండలంలోని ఎనిమిది క్లస్టర్ల పరిధిలోని 27 రెవెన్యు గ్రామాల నుంచి 470 మంది రైతులు రైతుబంధు పథకం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హత కల్గి ఉన్నారు. ఇప్పటికే కొందరు రైతులు దరఖాస్తు చేసుకున్నారు. మిగిలిన రైతులందరూ ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. గడువులోపు దరఖాస్తు చేసుకుంటే రైతు బంధు పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు.

– మణిచందర్, మండల వ్యవసాయ అధికారి

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి



పల్లెర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు

మద్దూరు: పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించి ఆర్థిక కష్టాలు కొనితెచ్చుకోకుండా ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు సూచించారు. మంగళవారం మండలంలోని పల్లెర్లలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన, డిజిటల్ తరగతులు, ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తులు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించే ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసుకున్న 27 మంది విద్యార్థులు స్థానికంగా ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేరగా వారికి ఉచిత పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు పావని, బాలయ్య, పాఠశాల చైర్మన్ కిష్టమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



తడి-పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు

కోస్గి రూరల్: ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి బట్ట సంచులను వాడాలని అలాగే ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు సూచించారు. మంగళవారం 100 రోజుల కార్యాచరణలో భాగంగా 12వ వార్డులో తడి-పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరు వేరు బుట్టలలో వేసి చెత్త సేకరణ సిబ్బందికి అందించాలన్నారు. అలాగే అమృత్‌జల్ పథకం ద్వారా త్వరలోనే ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పీఎసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్, మేనేజర్ అనిల్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ మోహిన్‌బాషా, మాస్టర్ శ్రీనివాస్ , రాంబాబు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

యాదవులకు సముచిత స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు గుర్రం హన్మంతు

కోస్గిరూరల్: జనాభా నిష్పత్తి ఆధారంగా యాదవులకు నామినేటెడ్ పదవులు కేటాయించడంతో పాటు సముచిత స్థానం కల్పించాలని యాదవుల జిల్లా అధ్యక్షుడు గుర్రం హన్మంతు కోరారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో యాదవుల ఓటు బ్యాంకు ఎక్కువగా ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా , మండలాల వారిగా సముచిత స్థానాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గొల్ల నర్సింలు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ ,ఉపాధ్యక్షుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ కిట్ల అందజేత



ఫిజియోథెరపీ కిట్లను అందజేస్తున్న అధికారులు

మరికల్: మండల వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన దివ్యాంగ విద్యార్థులకు ఎంఈఓ మానరోంజని ఫిజియోథెరపీ కిట్లను అందజేశారు. మంగళవారం సమ్మిళిత విద్య దినోత్సవం సందర్భంగా దివ్యాంగుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఫిజియోథెరపీ క్యాంపు, స్కాలర్‌షిప్, ఎస్కార్ట్, ట్రావెల్ అలవెన్స్ గురించి వివరించారు. అనంతరం అలీమ్ కో క్యాంపు ద్వారా గుర్తించిన దివ్యాంగులకు రోలటర్, ఇంటలెక్చువల్ డిసబులిటీ కిడ్స్‌లను అందజేశారు. వాటితో పిల్లలకు నిత్యం ఫిజియోథెరపీ చేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరత్నమ్మ, రాంరెడ్డి, అనిత, హరి ప్రసాద్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు బ్యాగుల వితరణ



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న దాతలు

మక్తల్: పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మక్తల్‌కు చెందిన గుంటగారి కుటుంబం యాజమాని శివలింగం ఆధ్వర్యంలో రూ.32 వేలు విలువ చేసే బ్యాగులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా గుంటగారి కుటుంబసభ్యులు శివలింగం, మంజుల, అనిరుద్, అనూష, ప్రశాంత్, ఆనంద్‌కు ఎంఈఓ అనిల్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. పేద విద్యార్థులకు తోచినంత సాయం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్‌కుమార్, బాబు, రూప, పరందా రాములు, లత, వెంకటమ్మ, మంజుల పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ అంబాజీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రమేశ్ రెడ్డితో కలిసి పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాల్లో నాణ్యమైన విద్యను బోధిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి చొరవతో కళాశాల మంజూరైన మొదటి ఏడాదిలోనే పక్కా భవన నిర్మాణానికి రూ.4.20 కోట్లు మంజూరు కావడంతో పనులు కూడా ప్రారంభించినట్లు మహేందర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెన్నకేశవ రెడ్డి, అధ్యాపకులు మధుసూదన్ రెడ్డి, భాస్కర్, తిరుపతి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా రేణుక ఎల్లమ్మ జాతర



తీలేర్ ఎల్లమ్మ ఆలయానికి బోనాలతో తరలివచ్చిన మహిళలు

మరికల్: మండలంలోని తీలేర్ గ్రామంలో ఐదేళ్ల కొసారి నిర్వహించుకునే రేణుక ఎల్లమ్మ జాతర మంగళవారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా ముందుగా జల్దిబిందెను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి జల, పంచామృతాభిషేకం నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు జరిపించారు. సాయంత్రం గ్రామంలోని మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి నైవేద్యాలు సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరవడంతో గ్రామం భక్తులతో కిటకిటలాడింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ రాము బందోబస్తు ఏర్పాటు చేశారు.

మక్తల్: మండలంలోని కాట్రెవ్‌పల్లి గ్రామంలో మంగళవారం పోలేరమ్మ ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని మహిళలు బోనాలు ఎత్తుకొని ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం పోలేరమ్మకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు ఉత్సవాలకు తరలిరావడంతో గ్రామంలో సందడి నెలకొంది.

ఘనంగా పోలమ్మ జాతర

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారం గ్రామంలో మంగళవారం పోలమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మూడేళ్లకు ఒకసారి నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా ఉదయం బీరప్ప దేవాలయం నుంచి అంబలికాసి ఊరేగింపుగా బయలుదేరి పోలమ్మ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు బోనాలతో ఊరేగింపుగా బయలుదేరి పోలమ్మ ఆలయానికి చేరుకొని నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటాం'



సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

దామరగిద్ద: ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండేది కమ్యునిస్టు పార్టీ నాయకులేనని సీఈఎం రాష్ట్ర నేత పట్టు ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని గడిమున్కన్‌పల్లిలో సీపీఎం పార్టీ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కమ్యునిస్టు ఉద్యమం, సీపీఎం విశిష్టత తదితర అంశాలపై కార్యకర్తలను శిక్షణ ఇచ్చారు.కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాల్, అంజిలయ్యగౌడ్ మహేష్ కుమార్, అశోక్, కాశప్ప, రామకృష్ణ, పవన్ అరుణ్ పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులపై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీపతి గౌడ్

నారాయణపేట రూరల్: జిల్లా న్యాయసేవ సంస్థ, లీగల్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కొల్లంపల్లి, చిన్నజట్రం గ్రామాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సు విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతి గౌడ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నాగేశ్వరి మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థలో రాజ్యాంగం ప్రకారం అందరికి సమాన హక్కులు కల్పించిందన్నారు. ప్రజలు వాటిపై అవగాహన కలిగి ఉన్నప్పుడే తమ హక్కులను సాధించుకోవచ్చన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ ద్వారా పేదలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే 18 ఏళ్ల నిండకముందే బాలికలకు పెళ్లిళ్లు చేయడం నేరమన్నారు. కార్యక్రమంలో పంచాయత్ సెక్రటరీ శివ కుమార్, అంజమ్మ, యాదమ్మ, నర్సమ్మ, రూపిక, కుర్మన్న, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

నారాయణపేట రూరల్: కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని ఊటకుంట తండాకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మంగళవారం స్థానిక గ్రామ కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏదైతే హామీలు ఇచ్చిందో అవి ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. నిరుపేదల సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో సాకారం చేస్తుందన్నారు. అలాగే రైతులకు రైతు భరోసా పథకాన్ని అమలు చేసి డబ్బులు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనురాధ, నాయకులు రాములు నాయక్, షణ్ముఖిభాయ్ పాల్గొన్నారు.

రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేయాలి



అమరచింత: రుణమాఫీ కాని రైతులకు పూర్తి స్థాయిలో రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని ఏఐకేఎస్ జిల్లా కోశాధికారి వెంకటేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్ఐ గోపాల్‌కు అందించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. రుణమాఫీ నేటికీ 50 శాతం మంది రైతులకు కాలేదని, వాటిని పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

కృష్ణా: మండలంలోని ముడుమాల్ గ్రామంలో గల ప్రభుత్వ భూమిని మక్తల్ పట్టణానికి చెందిన కొందరు నాయకులు కబ్జా చేశారని, అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని జ్యోతి రావ్‌పూలే బీసీ సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా కబ్జా వ్యవహారంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

రైతు భరోసా నిధులు విడుదల

నర్వ: మండలంలో రెండు ఎకరాల భూమి కలిగి ఉన్న మొత్తం 8518 రైతులకు సంబంధించిన రైతు భరోసా నిధులను ప్రభుత్వం విడుదల చేసినట్లు ఏఓ అఖిలారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెద్దకడ్మూర్ క్లస్టర్‌లో 1320 మంది రైతులకు రూ.1,20, 02760, కల్వాల్ క్లస్టర్‌లో 1401 రైతులకు గాను రూ.1,34,32107, లంకాల క్లస్టర్‌లో1343 రైతులకు గాను రూ. 1,24,19700 నర్వ క్లస్టర్‌లో 1571 రైతులకు గాను రూ.1,42,29720 పాథర్చేడ్ క్లస్టర్‌లో 984 మంది రైతులకు గాను రూ.9,29,5650 రాయికోడ్ క్లస్టర్‌లో 810 రైతులకు గాను రూ.8,22,6300 ఉందేకోడ్ క్లస్టర్‌లో 1089 రైతులకు గాను 98,00,0100 మొత్తం 7 క్లస్టర్‌లకు గాను 8518 రైతులకు రూ.7,94,06,337 జమ అయినట్లు తెలిపారు. కొత్తగా పాసు బుక్ వచ్చిన రైతులు ఏఈఓను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకోసం అకౌంట్ డీటెల్స్, ఏమైనా తప్పు ఉన్న సరిచేసుకోవచ్చన్నారు. ఈ నెల 20 వరకు గడువు ఉన్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు'

మరికల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తమ పథకాలుగా చెప్పుకోవడం సిగ్గుచేటని రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి రవి కుమార్ అన్నారు. మరికల్ కుర్వగేరిలో మంగళవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన, సడక్ యోజన, సుకన్య పథకం వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టగా రాష్ట్ర ప్రభుత్వం వాటినే పేర్లు మార్చుకొని తమ పథకాలుగా డబ్బు కొట్టుకుంటుందని మండిపడ్డారు. త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో ప్రజలందరూ బీజేపీ వైపు చూస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి నర్సన్‌గౌడ్, మండల అధ్యక్షుడు వేణు, సురేందర్‌గౌడ్, నరేష్ గౌడ్, కుర్మన్న, మోహన్‌రెడ్డి, నిఖిల్, ప్రకాష్, మల్లేష్, రవి, రాఘవేంద్ర, రమేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 11గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ధర్మతేజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో పడిపోయిన విద్యుత్ స్తంభాల పునరుద్ధరణతో పాటు లైన్ల సమస్యలను పరిష్కరించేందుకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

రాములు నాయక్ కుటుంబానికి ఆర్థిక సాయం



సరోజినిబాయికి నగదు అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కోస్గి: ఇటీవల గుండెపోటుతో మరణించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాములు నాయక్ కు టుంబానికి తోటి ఉపాధ్యాయులు అండగా నిలిచారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న రాము లునాయక్ ఆకస్మికంగా గుండెపోటుతో మరణించారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులంద రూ కలిసి మంగళవారం రూ.1.80 లక్షల ఆర్థిక సాయాన్ని రాములు నాయక్ భార్య సరోజిని బాయికి అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్‌నాయక్, గజిటెడ్ హెడ్మాస్టర్‌లు కృష్ణగౌడ్ ,శేఖరయ్య, వెంకట్రామిరెడ్డి, కుతుబుద్దీన్, ఎఫ్ ఎసీ రామకృష్ణ, రవిందర్‌రెడ్డి,వెంకట్రాములు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.20వేలు నగదు అందజేత

నారాయణపేట: జిల్లా కేంద్రంలో స్నేహ మిత్ర మండలి సభ్యుడు ప్యారసాని వెంకట్ రాములు ఆకస్మిక మరణించారు. ఈ క్రమంలో స్నేహ మిత్ర మండలి సభ్యులు మంగళవారం వెంకట్ భార్యకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వెంకట్ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో తమ వంతుగా సాయమంచినట్లు సభ్యులు తెలిపారు. స్వర్గస్తులైన తమ మిత్రుని కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మిత్ర మండలి అధ్యక్షుడు డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి, సభ్యులు మల్లేష్, గుత్తి రమేష్, శివకుమార్, సురేష్, వకీల్ ప్రశాంత్, గోపాల్, కృష్ణలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అక్షరాభ్యాసం

ఊట్కూరు: ఊట్కూరులోని యూపీఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో మంగళవారం గ్రామ పెద్దల సమక్షంలో విద్యార్థులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సలాం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, ఉచితంగా దుస్తులు, పుస్తకాలు అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని బడిబయటి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పేందుకు గ్రామ పెద్దలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వికార్, మునీర్ అహ్మద్, ఉపాధ్యాయులు జరీనాబేగం పాల్గొన్నారు.